ప్రజాశక్తి
సోమవారం 3, ఏప్రిల్ 2023 5 అనంతపురం



యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా కోటేశ్వరప్ప



కోటేశ్వరప్పను అభినందిస్తున్న జిల్లా యుటిఎఫ్ నాయకులు

రెండోసారి ఏకగ్రీవం

అనంతపురం కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శిగా వి.కోటేశ్వరప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన 48వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన కోటేశ్వరప్ప రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ తెలిపారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎంవి.మారితి శ్రీనివాస్, అనంతపురం జిల్లా వాసి ఎన్.దేవేంద్రమ్మ ఎన్నుకున్నట్లు తెలిపారు.

నేటి నుంచి పది పరీక్షలు



పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లను విద్యాశాఖ పూర్తి చేసింది. అనంతపురం జిల్లా పరిధిలో మొత్తం 139 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో 35,305 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు ఇన్విజిలేటర్ల నియామకం మొదలుకుని, పరీక్ష కేంద్రాల్లో అవసరమైన వసతుల ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆ శాఖ ప్రకటించింది. 2094 మందిని ఇన్విజిలేటర్లుగా నియమించారు.

అగ్రస్థానంలో నిలిపేందుకు కసరత్తు

అనంతపురం జిల్లాను పద తరగతి ఉత్తీర్ణతలో ఈసారి అగ్రభాగాన నిలిపేందుకు అవసరమైన కసరత్తును విద్యాశాఖ చేపట్టింది. జిల్లా కలెక్టరు ఎస్.నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఈ ప్రణాళికను అమలు జరిపారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఉత్తీర్ణత శాతం పెంపుదల కోసమని అనంత సంకల్పం పేరుతో ప్రణాళిక రూపొందించి విద్యార్థుల చదువులపై ప్రత్యేకమైన దృష్టిని సారించింది. ఏడు రౌండ్లలో పాఠశాల పునరుచ్చరణ, వీక్లి పరీక్షలు, అనంతరం ఇళ్ల వద్ద చదువుతున్నారా లేదా అన్న అంశాలను పరిశీలించారు. గతేడాది జరిగిన పరీక్షల్లో అనంతపురం జిల్లా చివరి స్థానంలో నిలిచింది. ఈసారి మెరుగుపరిచేందుకు ఈ ప్రణాళికను రూపొందించి అమలు జరిపే ప్రయత్నం చేశారు.

ఆరుగురు అంధ విద్యార్థులు నేరుగా పరీక్షకు

ఈ ఏడాది జరిగే పదవ తరగతి పరీక్షల్లో ఆరుగురు అంధ విద్యార్థులు ఎవరి సహకారం లేకుండా తమ ల్యాప్ ట్యాప్ ద్వారా వారే స్వయంగా పరీక్ష రాయనున్నారు. ఇది రాష్ట్రంలోనే తొలిసారి కావడం గమనార్హం. సాధారణంగా అయితే అంధ విద్యార్థులు చెబుతుంటే వారికంటే తక్కువ తరగతి అంటే తొమ్మిద వ తరగతి విద్యార్థులు పరీక్ష రాస్తారు. కాని ఆర్డీటీలోని ఇన్లివ్‌జీవ్ పాఠశాలల్లో చదువుతున్న ఆరుగురు విద్యార్థినులు నేరుగా ల్యాప్‌టాప్‌లో పరీక్ష రాయనున్నారు. దీనికి అవసరమైన అనుమతులను ప్రభుత్వమిచ్చింది. రాప్తాడులోని పదవ తరగతి పరీక్ష కేంద్రంలో వీరు పరీక్ష రాయనున్నారు.

'అనంత' సంకల్పంపై విమర్శలు

అనంత సంకల్పం పేరుతో విద్యార్థులపై ఒత్తిడి పెంచే విధంగా అధికారులు వ్యవహించారంటూ కొంతమంది విద్యావంతుల నుంచి విమర్శలు సైతం వచ్చాయి. గతేడాది పది పరీక్షల్లో ఉత్తీర్ణత తగ్గిందని, ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెంచాలంటూ ఇళ్ల వద్దకెళ్లి ఉపాధ్యాయులు తనిఖీలు చేయడం, ట్యాబుల్లో ఎన్ని గంటలు చూసారని ఉపాధ్యాయుల చేత పరీక్షింపచేయడం వంటివి విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెంచే ప్రయత్నం చేయడమేనని చెబుతున్నారు. వారిని స్వేచ్ఛగా చదువుకోనివ్వాలని, కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ అధికారులు ఒత్తిడి పెంచే విధంగా వ్యవహరించడం సరైంది కాదని అంటున్నారు.



సత్యసాయి జిల్లా ఐసిడిఎస్ పీడీ లక్ష్మీకుమారి

సజావుగా పౌష్టికాహారం పంపిణీ

శ్రీసత్యసాయి జిల్లా ఐసిడిఎస్ పీడీ లక్ష్మీకుమారి



ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లాలో పౌష్టికాహార పంపిణీ సక్రమంగా సాగుతోందని, ఎలాంటి అలసత్వం వహించకుండా ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ జరుగుతోందని ఐసిడిఎస్ పీడీ లక్ష్మీకుమారి పేర్కొన్నారు. ఆదివారం ఆమె ప్రజాశక్తితో ముఖాముఖి మాట్లాడారు. ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ప్రయోజన కార్యక్రమాలు..భవిష్యత్తులో చేపట్టబోవు పనుల గురించి కూలంకుశంగా వివరించారు.

ప్రశ్న : శ్రీ సత్యసాయి జిల్లాలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏయే కార్యక్రమాలు చేపడుతున్నారు.?

పీడీ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రజాప్రయోజన కార్యక్రమాలు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాం. శ్రీ సత్యసాయి జిల్లాలో 32 మండలాల్లో ప్రాజెక్టు పరిధిలో 2824 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా చిన్నారులకు, గర్భిణులకు బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నాం.

ప్రశ్న : ఫౌండేషన్ స్కూలు ద్వారా ప్రయోజనాలు ఏమైనా ఉన్నాయా?

పీడీ : ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఫౌండేషన్ స్కూల్ ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలను ఫౌండేషన్ స్కూల్‌గా మార్చి ప్రాథమిక పాఠశాలల్లో గదులు లభ్యమున్నచోట స్కూలు ఏర్పాటు చేస్తున్నాం. ఈ సంవత్సరం పి 1, పి2 పుస్తకాలను అందించి బోధిస్తున్నాం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కూడా బోధనలు అందుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2824 అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు ఏళ్ల వయస్సు చిన్నారులు 47,180 మంది ఉన్నారు. ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో కొన్నింటిని మినహాయిస్తే 113 కేంద్రాలను 93 పాఠశాలల్లో విలీనం చేశాం. మిగిలినవి అలాగే కొనసాగుతున్నాయి.

ప్రశ్న : అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మిస్తున్నారా?

పీడీ : కొన్ని సొంతభవనాల్లో మరికొన్ని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో అంగన్‌వాడీ కొత్త భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరయ్యాయి. నిర్మాణాలు కూడా చేపట్టారు. గతంలో కొన్నింటిని పూర్తి చేశారు. కొన్ని కేంద్రాలకు గ్రామీణ, పట్టణ, ప్రాంతాల్లో స్థలం లభ్యత కాకపోవడం వంటి కారణాల చేత నిర్మాణాల్లో జాప్యం జరుగుతోంది. ఇప్పటికే కొన్ని భవనాలు పూర్తి అయి అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. మరికొన్ని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నాం.

ప్రశ్న : అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించడంలో లోపాలపై మీ అభిప్రాయం ?

పీడీ : చిన్నారులు, గర్భిణులు బాలింతలకు చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో సదరు కాంట్రాక్టర్లు చేతివాటం ప్రదర్శించినట్లు గతంలో తమ దృష్టికి వచ్చిందన్నారు. జిల్లాలో కొన్నిచోట్ల అధికారులతో పర్యవేక్షణ చేపట్టి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకున్నాం. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నాం. చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ పర్యవేక్షణ చేసేందుకు ఇప్పుడు అధికారులు చాలామంది ఉన్నారు. వారి ద్వారా ఎలాంటి అవకతవకలు జరక్కుండా చర్యలు చేపడతాం. ఏడు నెలల నుండి ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు పాలు, గుడ్లు అందజేస్తున్నాం. వైఎస్సార్ సంపూర్ణ భోజన పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 15910 మంది గర్భిణులు, 4952 మంది బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం తీసుకుంటున్నారు. ఏడు నెలల నుండి మూడు సంవత్సరాలలోపు 64530 మంది చిన్నారులకు ప్రతి నెలా బాలామృతం ప్యాకెట్లు అందజేస్తున్నాం.

ప్రశ్న : అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టుల నియామకంలో అవకతవకలపై మీ అభిప్రాయం ?

పీడీ : అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టుల నియామకం కోసం అర్హత పరీక్షను ఏపీపీఎస్ ద్వారా నిర్వహించారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదు. అత్యధిక మార్కులు సంపాదించిన ముగ్గురు సభ్యులను తీసుకొని వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఇద్దరిని ఎంపిక చేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలోనే వీటన్నింటిని నిర్వహించాం. ఎలాంటి అవకతవకలకూ తావు లేకుండా సూపర్‌వైజర్ పోస్టుల నియామకం జరిగింది.

చేనేత కార్మికులను ఆదుకుంటాం..

మగ్గం ఉన్న ప్రతి కార్మికునికీ 200 యూనిట్లు ఉచిత విద్యుత్
యువగళం పాదయాత్రలో నారా లోకేష్



బత్తలపల్లి బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్, బత్తలపల్లి

టిడిపి అధికారంలోకి రాగానే చేనేత కార్మికులను ఆదుకుంటామని, మగ్గం ఉన్న ప్రతి కార్మికునికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పేర్కొన్నారు. నారా లోకేష్ 58వ రోజు యువగళం పాదయాత్ర ఆదివారం ధర్మవరం పట్టణం నుంచి ప్రారంభమైంది. స్థానిక మార్కెట్ యార్డ్ సమీపంలోని సిబిఎన్ కల్యాణమండపంలో చేనేతల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. గొట్లూరులో కురుబ సామాజిక వర్గీయులతో ఆయన భేటీ అయ్యారు. నాగలూరులో బోయ కులస్తులతో సమావేశమయ్యారు. వేల్పుమడుగు వద్ద పోడరాళ్లపల్లి వాసులతో మాట్లాడారు. బత్తలపల్లిలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ.. ధర్మవరం చేనేతకు పుట్టినిల్లు అన్నారు. దేశంలోనే ధర్మవరం పట్టుచీరలకు మంచి పేరు ఉందన్నారు. అయితే వైసిపి పాలనలో చేనేత కార్మికులు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఒక్క ధర్మవరం పట్టణంలోనే 53 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలను వైసిపి ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక చేనేత కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. చేనేత వస్త్రాలపై జిఎస్‌టి వేయాలని టిడిపి ప్రభుత్వ హయాంలోనే కేంద్రం ప్రతిపాదన పెట్టిందన్నారు. అయితే అప్పుడు కేంద్రంతో మాట్లాడి పక్కన పెట్టించామని తెలిపారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక చేనేత వస్త్రాలపై జిఎస్‌టి వసూలు చేస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే చేనేత వస్త్రాలపై జిఎస్‌టిని ఎత్తివేయించడానికి కృషి చేస్తామని చెప్పారు. టిడిపి అధికారంలోకి వస్తే సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేస్తారని జగన్ వాలంటీర్లతో ప్రచారం చేయిస్తున్నాడన్నారు. రాష్ట్రానికి సంక్షేమాన్ని పరిచయం చేసిందే టిడిపి అన్నారు. జగన్ పాలనలో ఖైదీలకు కల్పించే సౌకర్యాలు కూడా విద్యార్థులకు కల్పించడంలేదన్నారు. ఖైదీలకు నెలకు రూ.2 వేలు ఖర్చు చేస్తుంటే విద్యార్థులకు కేవలం రూ.వెయ్య మాత్రమే మెస్ ఛార్జీలు ఇస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదన్నారు. గ్రూప్ 2, డిఎస్‌సి లేదన్నారు. వైసిపి ప్రభుత్వం రైతులను ఆదుకోకపోగా వ్యవసాయ బోర్లకు మీటర్లు పెట్టి ఉరితాళ్లు బిగిస్తోందన్నారు. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అరాచకాల గురించి తెలుసుకున్నాక ఆయన కేతిరెడ్డి కాదు.. నంబర్ వన్



హాజరైన టిడిపి నాయకులు, కార్యకర్తలు

కేటుగాడు అని అర్థమైందని విమర్శించారు. టిడిపి హయాంలో ధర్మవరంలో ధర్మం ఉండేదని అన్నారు. కేటుగాడు ఎమ్మెల్యే అయ్యాక ధర్మవరంలో మొత్తం అధర్మమే అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునీత, టిడిపి సత్యసాయి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి, పరిటాల శ్రీరాం, కందికుంట ప్రసాద్, బండారు శ్రావణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌కు చేనేత పట్టు వస్త్రాలు అందజేత

నారా లోకేష్‌కు ధర్మవరం తొగట వీర క్షత్రియులు వారి కులదేవత చౌడేశ్వరిదేవి చిత్రంతో ఉన్న పట్టు వస్త్రాన్ని లోకేష్‌కు అందజేశారు. 40 ఏళ్ళుగా చేనేతలకు అండదండగా నిలుస్తున్న టిడిపి కుటుంబానికి పట్టుచీరలు, పంచెలు, కండువాలు అందజేశారు. తొగటవీర క్షత్రియులకు లోకేష్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించండి

ప్రభుత్వం నుంచి పరిహారాన్ని ఇప్పించి న్యాయం చేయాలని ముదిగుబ్బ మండలం పొడరాళ్లపల్లి జిల్లేడు బండ ప్రాజెక్టు ముంపు రైతులు లోకేష్‌ను కలిసి విన్నవించారు. 2003లో చంద్రబాబు నాయుడు సిఎంగా ఉన్న సమయంలో ఎక్కువగా భూములు ముంపునకు గురికాకుండా 0.48 సామర్థ్యంతో ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చారన్నారు. దీంతో మిగిలిన సాగుభూమిలో మామిడి, చీని, జామ, పూల మొక్కలు పెంచుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే వైసిసి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును 2.48 టిఎంసిలకు పెంచుతూ అనుమతులు మంజూరు చేసిందన్నారు. దీనివల్ల దాదాపు 1500 ఎకరాలు ముంపునకు గురవుతుందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూ సేకరణపై రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధర ప్రకారం ఎకరాకు రూ.30 లక్షలు పరిహారం చెల్లించేలా చూడాలని రైతులు నారా లోకేష్‌ను కోరారు. స్పందించిన లోకేష్ రాష్ట్రంలో సిఎం జగన్ ప్రభుత్వానికి భూములు లాక్కోవడంపై ఉన్న శ్రద్ధ నిర్వాసితులకు పరిహారం అందించడంలో చూపలేదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. దీనిపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చండి

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వాల్మీకి బోయలను ఇతర రాష్ట్రాల మాదిరిగా ఎస్టీ జాబితాలోకి చేర్చేలా కృషిచేయాలని వాల్మీకి బోయ సంక్షేమ సంఘం ప్రతినిధులు లోకేష్‌ను కలిసి విన్నవించారు. రాష్ట్రంలో 40 లక్షల మందికి పైగా వాల్మీకులు, బోయలు ఉన్నారని కులవృత్తి లేక కూలిపనులు, చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. వాల్మీకి ఫెడరేషన్ ద్వారా సామాజిక వర్గీయులకు బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే దామాషా పద్ధతిన వాల్మీకి బోయ కార్పొరేషన్‌కు నిధులు కేటాయిస్తామని లోకేష్ వారికి హామీ ఇచ్చారు.

సకల జీవరాసులకు భూమి, చెట్లు రక్ష

అదనపు ఎస్పీ హనుమంతు



మొక్క నాటి నీరు పోస్తున్న అదనపు ఎస్పీ హనుమంతప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సకల జీవరాసులకు ఆధారం భూమి, చెట్లని భూమిని ఆధారంగా చేసుకుని చెట్లు ఆహారాన్ని ఉత్పత్తి చేసి మనకు అందిస్తాయని, ఆహారం తీసుకోవడం వల్లే సకల జీవరాసులు పునరుత్పత్తి శక్తిని పొంది మనుగడ సాగిస్తున్నాయని జిల్లా అదనపు ఎస్పీ ఉ.హనుమంతు అన్నారు. ఆదివారం కుందుర్పి మండల కేంద్రంలోని అభయ ఫౌండేషన్, ఎస్కే ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని జిల్లా అదనపు ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఎఎస్పీ మాట్లాడుతూ మనిషి తన స్వార్థం కోసం ప్రకతికి విరుద్ధమైనటువంటి పనులను చేస్తున్నాడని, అత్యాశతో ఎక్కువ ఆహారాన్ని పండించాలని విచ్చలవిడిగా రసాయనాలను వెదజల్లడంతో భూమి విషతుల్యమవుతోందన్నారు. అందుకే మనం తింటున్న ఆహారం ప్రమాదకర రసాయనాలతో నిండి ఉందన్నారు. ఇంకో వైపు విచక్షణారహితంగా చెట్లను నరికేస్తూ ఆకతాయితనంతో, స్వార్థంతో పొదలకు నిప్పంటించడం వల్ల కొండలు, అడవులలోని వేలాది చెట్లు రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు అగ్నికి ఆహుతవుతున్నాయని తెలిపారు. మనకు ఆధారమైనటువంటి నేలతల్లిని ప్రాణాధారమైన చెట్లను రక్షించకపోతే మనకు మనుగడే ఉండదన్నారు. అందుకే రైతులంతా ప్రకతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని, అందరం విరివిగా చెట్లను నాటి సంరక్షిద్దామని పిలుపునిచ్చారు. కుందుర్పిలోని కొండను చూస్తే అద్భుతం అనిపిస్తోందన్నారు. చక్కటి కళాకతితో తీర్చిదిద్దినట్టుగా ఉందన్నారు. ఏకశిలగా లింగాకతిలో సహజంగా ఏర్పడిన స్వయంభువుగా కనిపిస్తోందని, కుందుర్పికి ప్రకతిమాత గొప్ప బహుమతిగా ఇచ్చిన ఈ కొండని అభివద్ధి చేస్తే భవిష్యత్తులో కుందుర్పి గొప్ప దార్శనీయ స్థలంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తల్లి దండ్రుల జ్ఞాపకార్థం లెనిన్ బాబు ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రం నిర్వహించడం అభినందనీయమన్నారు. గాయకుడు లెనిన్ బాబు మాట్లాడుతూ మే 1వ తేదీ నుంచి కుందుర్పి మండలంలోని 13 పంచాయతీలలో విద్యార్థులను సామాజిక బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దేందుకు సంస్కార కేంద్రాల పేరుతో ఉచిత సాయంత్రపు బడులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉచిత టైలరింగ్ శిక్షణతో పాటు డ్రైవింగ్, బ్యూటీషియన్ శిక్షణ కూడా ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కుందుర్పి సర్పంచ్ మారుతీశ్వరి రామమూర్తి, కుందుర్పి మండల వైద్యాధికారి పఠాన్ చాంద్ బేగం, కుందుర్పిలోని ఆలయాల ధర్మకర్త సత్యనారాయణ శాస్త్రి, ఎస్కే చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు గాయకుడు లక్ష్మణమూర్తి, టి.రాజు, జగదీష్, శ్రీకాంత్, దిలీప్, ఉమాదేవి, సరోజమ్మ, సావిత్రమ్మ, రఘువీరతోపాటు టైలరింగ్ శిక్షకురాలు అంబుజా, శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.

పాదయాత్రకు ఆదరణ లేకే లోకేష్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు

వైసిసి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య

ప్రజాశక్తి-రాయదుర్గం

యువగళం పేరిట నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు ప్రజల్లో ఆదరణ లేకపోవడంతో వల్లే వైసిపి నాయకులు, కార్యకర్తలపై రెచ్చగొట్టే ధోరణిలో వారు వ్యవహరిస్తున్నారని వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య అన్నారు. ఆదివారం రాయదుర్గంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరసింహయ్య విప్ కాపు రామచంద్రారెడ్డి, జెడ్‌పి ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పాదయాత్ర సందర్భంగా లోకేష్ ముఖ్యమంత్రి జగన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీపై అడ్డగోలు ఆరోపణలు చేసినా ప్రజల నుండి స్పందన లేకపోవడంతో పెయిడ్ ఆర్టిస్టులను, రోజు కూలీలను యాత్రలో ఉపయోగించి ప్రజలను మభ్యపెడుతున్నారని ఎద్దేవా చేశారు. పాదయాత్ర అట్టర్ ప్లాప్ అయిందన్నారు. మీడియా దృష్టిని ఆకర్షించేందుకు ప్రశాంతమైన జిల్లాలో టిడిపి కార్యకర్తలను రెచ్చగొట్టి, శాంతిభద్రతలకు భంగం కలిగే విధంగా లోకేష్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పుట్టపర్తిలో శనివారం జరిగిన అల్లర్లు అందుకు నిదర్శనమన్నారు. రాప్తాడులో శ్రీనివాస్ అనే కార్యకర్త దారుణ హత్యకు గురయ్యారని తెలిపారు. లోకేష్ మూర్ఖుడని, తాను ఫ్యాక్షనిస్ట్‌గా మారుతానని, 20 కేసులు ఉంటేనే దగ్గరకు రమ్మని చెబుతున్నట్లు వ్యాఖ్యానించారు. కరువు లేదా ప్రజా సమస్యలు ఉంటే ఎవరైనా పాదయాత్ర చేస్తారన్నారు. రాష్ట్రంలో సుభిక్షమైన వాతావరణం నెలకొన్నప్పుడు లోకేష్ పాదయాత్ర చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. లోకేష్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలన్నారు. మండలి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ ద్వారా నాలుగు సీట్లను గెలవగానే రాష్ట్రంలోని ప్రజలందరూ ఏకపక్షంగా టిడిపికి తీర్పు ఇచ్చారని భ్రమ పడుతున్నారని అన్నారు. జెడ్‌పి ఛైర్మన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగన్ రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారన్నారు. చంద్రబాబు, లోకేష్ దుష్ప్రచారం చేయడం, యువగళం పేరిట రెచ్చగొట్టే ధోరణి అవలంభించడం సరికాదన్నారు. యువతను, మహిళలను, పేదలను మోసం చేసింది మీరు కాదా, యాత్రకు స్పందన లేక రణరంగంగా మార్చింది మీరు కాదా అని ప్రశ్నించారు. విప్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పప్పు 'లోకేష్ యువగళం పేరిట పాదయాత్ర చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కనీసం వార్డు మెంబరుగా కూడా గెలవలేని లోకేష్ చేపట్టిన పాదయాత్రకు జనం లేకపోగా, కూలీ ఇచ్చి, సెల్ఫీలు తీయించి, డబ్బు వెదజల్లి యాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అమరావతి పాదయాత్ర కూడా విఫలం అయిందని అన్నారు. టిడిపికి కాలం చెల్లిందని, ఇప్పటికైనా మారాలన్నారు. లేకుంటే వచ్చే ఐదేళ్లలో తామేమిటో చేసి చూపుతామని హెచ్చరించారు. లోకేష్ చేపట్టిన యువగళం యాత్ర డ్రామా అని, డబ్బాయాత్ర అని వ్యాఖ్యానించారు. విలేకరుల సమావేశంలో ఎపిఐఐసి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, రాయదుర్గం ఎంపిపి విద్యావతి, జెడ్పిటిసి సభ్యులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్ర యాదవ్

సెంట్రల్ వర్సిటీ ఎస్ఎఫ్ఐ నాయకులపై
సస్పెన్షన్ ఎత్తివేయాలి
ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్ర యాదవ్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ నాయకులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజన హామీల భాగంగా అనంతపురంలో ఏర్పాటయిన సెంట్రల్ యూనివర్సిటీ సమస్యలకు నిలయాలుగా మారిందన్నారు. ఉన్న సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల తరుపున ఎస్ఎఫ్ఐ సెంట్రల్ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో పలుమార్లు ప్రాంగణంలో ఆందోళనలు నిర్వహించిందన్నారు. ఈనేపథ్యంలో ఫైనల్ ఇయర్ విద్యార్థుల పరీక్ష ఫలితాల్లో జరిగిన అవకతవకల్లో యూనివర్శిటీ డీన్ పాత్రను తప్పుపడుతూ యూనిట్ కమిటీ విసికి ఇచ్చిన వినతిని యునివర్సిటీ గోడకు అంటించినందుకు ఐదుగురు ఎస్ఎఫ్ఐ నాయకత్వాన్ని హాస్టల్ నుంచి సస్పెండ్ చేయడం ఏంటని ప్రశ్నించారు. డీన్‌పై చర్యలు తీసుకోవాల్సిన విసి ఫిర్యాదు చేసిన వారిపై చర్యలకు పాల్పడటం హేయమైన చర్య అన్నారు. యూనివర్శిటీలో విద్యార్థి సంఘాలకు మాట్లాడే స్వేచ్చను అధికారుల హరిస్తున్నారని వాపోయారు. వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యుడు రుషి, ఎస్కెయు శాఖ నాయకులు సందీప్, అనిల్‌కుమార్, సన్నీ, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

'యువగళం' ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-శింగనమల



శింగనమలలో పాదయాత్ర ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర త్వరలో నియోజకవర్గంలోని అడుగిడుతున్న నేపథ్యంలో స్థానిక టిడిపి నాయకులు ఆదివారం పరిశీలించారు. ఇందులో భాగంగా నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, తెలుగుయువ రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు కలిసి మండలం కేంద్రంలో ఏర్పాటు చేయనున్న సభాస్థలిని, బస చేసే ప్రాంతాలను, రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సి.వెంకటేష్, దాసరి గంగాధర్, మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, పార్లమెంటు కోశాధికారి శ్రీనివాసులుగౌడ్, ఎం.ఆదినారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షులు బండి వెంకటనారాయణ, మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్‌గౌస్, జడేజా, ఎన్.విజయ్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు అనుగుణంగా బస్సులు నడపాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

పదో తరగతి పరీక్షలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రాజు కోరారు. ఈమేరకు ఆదివారం ఆర్టీసీ డిపో మేనేజర్ సురేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయదుర్గం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా అన్ని పరీక్ష కేంద్రలో ఏప్రిల్ 3 నుంచి 18 తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు ఉదయం 7.45 గంటల నుంచి 12.45 గంటల వరకూ పరీక్షలు ఉంటాయన్నారు. కావున 30 నిమిషాలు ముందుగా పరీక్ష కేంద్రాలకు బస్సులు చేరుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ తాలూకా నాయకుడు గురుస్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు

శింగనమల : మండలవ్యాప్తంగా పదో తరగతి చదివిన విద్యార్థులకు నేటి నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నట్లు ఎంఇఒ నరసింహరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌లో 310 మంది విద్యార్థులు, కేజీబీవీ స్కూల్ సెంటర్‌లో 160 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు.

బొమ్మనహాల్ : నేటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ తిమ్మప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రతిభ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కావున విద్యార్థులు సమయానికి అనుగుణంగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కోరారు.

పాలనలో సిఎం జగన్ విఫలం
టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాన్ని పరిపాలించడంలో పూర్తిగా విఫలమయ్యారని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 4న అనంతపురం పార్లమెంటు నియోజకవర్గంలోకి లోకేష్ పాదయాత్ర ప్రవేశిస్తుందన్నారు. సుమారు పది రోజులకుపైగా సాగే ఈ యాత్రలో ఈనెల 7న గార్లదిన్నె సమీపంలో పెద్దఎత్తున రైతు సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు రాయదుర్గం నియోజకవర్గం నుంచి ఎక్కువమంది నాయకులు, కార్యకర్తలు, రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇకపోతే సిఎం జగన్‌కి పరిపాలన అనుభవం లేకపోవడం వల్లే రాష్ట్రంలో వ్యవస్థలు అన్ని చిన్నాభిన్నమయ్యాయన్నారు. ముఖ్యంగా వ్యవసాయం మునుపెన్నడూ చూడని సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు. రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రం రెండోస్థానంలో ఉండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ముఖ్యంగా నియంతృత్వ ధోరణితో ప్రవర్తిస్తున్న సిఎం జగన్ విధానాలను మేధావులు, అన్నివర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో రాయలసీమలో ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను వైసిపి అధికారంలోకి ఇచ్చాక పూర్తిగా విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా జెడ్పీఛైర్మన్ నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు రాజు, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి సంపత్ కుమారి, రాష్ట్ర తెలుగు రైతు కేశవ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మండల కన్వీనర్లు హనుమంతు, లాలేప్ప, బలరామిరెడ్డి, గిరి మల్లప్ప, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు వెంకటేశులు, రైతు ఉపాధ్యక్షుడు వెంకటేశులు, మార్కెట్ యార్డ్ వైస్‌ఛైర్మన్ వన్నారెడ్డి, మరియప్ప, మాజీ ఎంపిపి పాలయ్యా, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు మోహన్‌రెడ్డి, ఆనంద్‌రాజ్, మారుతీ, ఇనాయత్, నాగరాజు, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు

నారా లోకేష్ పాదయాత్రను జయప్రదం చేద్దాం
మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రను సమిష్టిగా పని చేసి విజయవంతం చేద్దామని టిడిపి అనంతపురం అర్బన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్‌చౌదరి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని టిడిపి అర్బన్ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. అంతకుముందు యువనేత నారా లోకేష్ నియోజకవర్గంలోకి రాగానే నిర్వహిస్తున్న బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించి నిర్వహణ ఏర్పాట్లపై నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4వ తేదీ ఉదయం నుంచి నారా లోకేష్ పాదయాత్ర నగరంలో ప్రారంభమవుతుందన్నారు. కావున ప్రతి కార్యకర్త మమేకం అవుతూ పాదయాత్రలో పాల్గొనాలని కోరారు. ఇందులో భాగంగా నాయకుల వారీగా పలు బాధ్యతలను అప్పగించారు. అనంతరం నగరంలోని పలువురు వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. వారిని ప్రభాకర్‌చౌదరికండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు మారుతీకుమార్ గౌడ్, టిడిపి రాష్ట్ర నాయకులు దేవళ్ల మురళి, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, నారాయణస్వామియాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ సాకే గంపన్న, మాజీ కార్పొరేటర్ రాజారావు, నటేష్‌చౌదరి, సరళ, టిడిపి మహిళా విభాగం నగర అధ్యక్ష కార్యదర్శులు విజయశ్రీరెడ్డి, జానకి, రాష్ట్ర నాయకులు స్వప్న, తేజశ్విని తదితరులు పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి



పాదయాత్ర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభాకర్‌చౌదరి, టిడిపి నాయకులు

సంఘీభావ యాత్ర విజయవంతం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ తెలుగు యువత ఆధ్వర్యంలో చేపట్టిన సంఘీభావ యాత్ర విజయవంతమైంది. ముందుగా భాగంగా ఆదివారం పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ప్రారంభించిన అనంతరం బసవన్న కట్ట, సప్తగిరి సర్కిల్, క్లాక్ టవర్ మీదుగా ఎన్టీఆర్ విగ్రహం వరకు సంఘీభావ యాత్ర సాగింది. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్ మాట్లాడుతూ యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం మాకు ఎంతో ఉత్తేజాన్ని పెంపొందించిందన్నారు. సంఘీభావ యాత్రను అడ్డుకోవాలని ఎందరూ ప్రయత్నించిన వాటన్నిటిని ఎదురించి యువ నేత నారా లోకేష్‌కు మద్దతుగా యువత ముందుకు రావడం అభినందనీయంగా ఉందన్నారు. మార్పు కోసం నడుం బిగించి యాత్రను విజయవంతం చేసిన విజ్ఞానవంతులైన యువతకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో యువనే పాదయాత్రలో పాల్గొని జయప్రదం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు రంగా, అధికార ప్రతినిధి వెంకటరామయ్య, సైఫుద్దీన్, పవన్, ఫిరోజ్, జాఫర్, మణి రవి, గోపాల్, రఫీ, సురేష్, రాము, కష్ణారెడ్డి, సుమలత, డిష్ ప్రకాష్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న టిడిపి నాయకులు

నేరాలు ఘోరాలు

గడ్డివాములు దగ్ధం

యాడికి : మండల కేంద్రంలోని లక్ష్మీప్రియ థియేటర్ సమీపంలో ఉన్న ఓ కళ్లదొడ్డిలోఉన్న గడ్డివాములు ఆదివారం అగ్నికి ఆహుతయ్యాయి. మండల కేంద్రంలోని కోట వీధిలో తోట నారాయణరెడ్డి, సోమశేఖర్‌రెడ్డికి చెందిన పశుగ్రాసం ప్రమాదవశాత్తు చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైంది. దీంతో రైతన్నలకు సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని వాపోయారు.

కొళాయి మోటర్ చోరీ

పుట్లూరు : మండల కేంద్రంలో ఇంటింటికీ నీటి కొలాయిలో భాగంగా ఏర్పాటు చేసుకున్న మోటార్ చోరీ గురైనట్లు బాధితుడు జనార్ధన్‌రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తమ ఇంటి వద్ద తాగునీటి కోసం ఏర్పాటు చేసుకున్న మోటార్ చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

కిందపడి బాలుడికి గాయాలు

గుత్తి : మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన ఓ బాలుడు ఆదివారం కాలుజారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన జస్వంత్ అనే 9వ తరగతి విద్యార్థి తన ఇంటి నుంచి చేనుకి వెళ్తుండగా దారిలో కాలు జారి కిందపడ్డాడు. దీంతో ఆ బాలుడికి రాయి తలకి తగిలి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

ఆంగ్లభాష తోడుంటే..ఉద్యోగాలు మీ వెంటే..

ప్రజాశక్తి-యాడికి

ఆంగ్ల భాషలో పట్టు సాధిస్తే ఉద్యోగావకాశాలు మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాయని కరస్పాండెంట్ విశ్వనాథ్ సూచించారు. ది వరల్డ్ ఆఫ్ ఇంగ్లీష్ కార్యక్రమంలో భాగంగా విజన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్నిరంగాల్లో ఆంగ్లభాషకు అత్యంత ప్రాముఖ్యత ఉందన్నారు. దీంతోనే ఇంగ్లీష్‌పై పట్టు సాధించేందుకు పాఠశాల విద్యార్థులను మెరికల్లా తయారు చేస్తున్నామన్నారు. టీచర్లతో పాటు విద్యార్థులు పాఠశాలల్లో తప్పనిసరిగా ఇంగ్లీష్ మాట్లాడాలన్న నిబంధన పాటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెలుగు యువత మండల అధ్యక్షుడిగా విజయ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్లూరు



మండల తెలుగు యువత అధ్యక్షునిగా ఎస్.గూడూరు గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌రెడ్డిని ఎంపిక చేశారు. తనను తెలుగు యువత అధ్యక్షునిగా ఎంపిక చేసినందుకు టిడిపి జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని యువతకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

బీఎస్పీ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గుత్తి



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

బహుజన్ సమాజ్ వాదీ పార్టీ (బీఎస్పీ) నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నికైంది. గుత్తి ఆర్ఎస్‌లోని బీఎస్పీ కార్యాలయంలో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు గద్దల నాగభూషణం ఆదేశాల మేరకు ఉపాధ్యక్షులు ఎం.వెంకటయ్య, గుంతకల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.శ్రీనివాసరాజు, కన్వీనర్ బి.వెంకటకొండయ్య సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షులుగా విజయ్, ఉపాధ్యక్షులుగా రిజ్వానా, ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

జీవో నెంబర్ 52ను రద్దుచేయాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

జీవో నెంబర్ 52ను వెంటనే రద్దు చేయాలని బంజారా సేవాసమితి నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పాత ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలిండియా బంజారా సేవా సమితి సంఘ్ శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు అంజి నాయక్ ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా వెంకటేష్ నాయక్, ఉపాధ్యక్షులుగా చంద్రనాయక్, శ్రీకాంత్ నాయక్ విజయ్ నాయక్ జనరల్ సెక్రెటరీగా విక్రాంతనాయక్‌ను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అంజి నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం జీవో నెంబర్ 52 ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబును ప్రజలు నమ్మొద్దు..

ప్రజాశక్తి-రాయదుర్గం

టిడిపిని, ఆ పార్టీ అధినేత చంద్రబాబుని ప్రజలు నమ్మొద్దని కాపు రామచంద్రారెడ్డి హెచ్చరించారు. రాయదుర్గంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా మహిళా సంఘాలకు మెగా చెక్కు పంపిణీ చేశారు. ముందుగా సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే పచ్చ కుక్కలకే లాభం ఉంటుందన్నారు. ఆడపడుచులను సిఎం జగనన్న పుట్టింటి కంటే ఎక్కువ ప్రేమతో చూసుకుంటారన్నారు. అవసరమైతే అప్పు చేసి కాదు, అడుక్కు వచ్చి అయినా ఆడపిల్లలకు ఇస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ మహిళా పక్షపాతి అన్నారు. అందుకు మహిళలు సిఎం కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో లేనివిధంగా సీఎం జగన్ నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి పథకాల సొమ్మును జమ చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జగన్‌ను సీఎంగా, కాపు రామచంద్రారెడ్డిని ఎమ్మెల్యేగా తిరిగి గెలిపించాలని కోరారు. మహిళలకు ఇళ్ల వద్దకే నేరుగా లబ్ధి చేకూరుస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షురాలు పోరాళు శిల్ప, వైసిపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ కాపు భారతి, రాయదుర్గం మున్సిపల్ వైస్‌ఛైర్మన్‌లు శ్రీనివాస్ యాదవ్, వలిబాషా, స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు భోజరాజునాయక్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మాధవరెడ్డి, తహశీల్దార్ మారుతి, కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఐకెపి ఏరియా కోఆర్డినేటర్ గంగాధర్, మెప్మా టిఎంసి నారాయణరెడ్డి రాయదుర్గం ఎంపిపి విద్యావతి మున్సిపల్ వార్డు సభ్యులు రాష్ట్ర గహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసులు, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ ఉషా, తదితరులు పాల్గొన్నారు.




అనంతపురంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

'ఆసరా'లో ఎమ్మెల్యేలు

అనంతపురం : పేదల సంక్షేమమే లక్ష్యంగా సిఎం జగన్ పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని తపోవనం సర్కిల్‌లో ఉన్న వివిఆర్ ఫంక్షన్ హాల్‌లో 'వైఎస్ఆర్ ఆసరా' వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీ నరసింహారావు హయాంలో డ్వాక్రా సంఘాలు ఏర్పడ్డాయన్నారు. ప్రతి కుటుంబంలో పొదుపు అవసరమన్న ఉద్దేశంతో సంఘాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. గతంలో మహిళా సంఘాలు రుణాలు తీసుకుంటే వడ్డీ అంతా వాళ్లే కట్టే పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాక పావలా వడ్డీ పథకాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. 2014 ఎన్నికలకు ముందు తాను అధికారంలోకి వస్తే మహిళా సంఘాల రుణాలను మాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు.. తీరా సీఎం అయ్యాక హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. 2019లో జగన్ సిఎం అయ్యాక ఇప్పటి వరకు మూడు విడతల్లో వైఎస్ఆర్ ఆసరా కింద రూ.19 వేల కోట్లను మహిళా సంఘాలకు అందించినట్లు చెప్పారు. వచ్చే ఏడాదిలో చివరి విడత మరో రూ.6 వేల కోట్లను అందిస్తామని తెలిపారు. అనంతరం సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, కమిషనర్ రమణారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోటగం విజయభాస్కర్‌రెడ్డి, వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్పొరేటర్లు రాజేశ్వరి, రహంతుల్లా, శేఖర్ బాబు, సైఫుల్లా బేగ్, శ్రీనివాసులు, గోగుల లక్ష్మీ, దుర్గాదేవి, శాంతి సుధ, వైసీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కష్ణవేణి, వైసీపీ నేతలు నిహార్, రమణారెడ్డి, ఖాజా, శ్రీనివాసులు, శ్రీదేవి, కృష్ణవేణి, శోభా బాయ్, శోభా రాణి తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : టిడిపి అధినేత నారా చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ చేస్తున్న పాదయాత్ర ప్రజలను రెచ్చగొట్టేలా సాగుతోందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. ఆదివారం వజ్రకరూరు మండల కేంద్రంలో వైఎస్ఆర్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాత ప్రభుత్వం అన్నారు. మహిళల అభ్యున్నతికి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన, ఇవ్వని హామీలను సైతం అమలు చేసిన ఘనత ఒక్క జగన్‌కే దక్కుతుందన్నారు. ఇందులో భాగంగానే వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ చేయూత, సున్నా వడ్డీ ద్వారా మహిళలను ఆదుకున్నారని తెలిపారు. అనంతరం మహిళలతో కలిసి సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జోనల్ అధ్యక్షుడు వై.ప్రణయ్‌రెడ్డి, సర్పంచి మోనాలిసా, ఎంపిపి దేవీబాయి, వైస్ ఎంపిపిలు సుశీలారాణి, సుంకమ్మ, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ రాజశేఖర్ రెడ్డి, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుశీలమ్మ, ఎంపిడిఓ శ్రీనివాసులు, ఎపిఎం గుణశ్యాం, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండ మండలం వజ్రకరూరులో మెగా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైసిపి నాయకులు



రాయదుర్గంలో మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా, తదితరులు

నార్పల : పేదవాళ్లు గొప్పవాళ్లవుతుంటే చాలామందికి నచ్చడం లేదని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో వైఎస్ఆర్ ఆసరా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఖాతాల్లో నగదు వేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను అందరూ మెచ్చుకుంటుంటే, ప్రతిపక్షనేతలు మాత్రం శాపనార్థాలు పెడుతున్నారన్నారు. కావున విజ్నులైన ప్రజలందరూ గమనించాని కోరారు. అనంతరం స్థానిక కూతలేరు వంకపై నిర్మించిన కల్వర్టుతోపాటు నూతనంగా నిర్మించిన రెండవ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, ఎంఇఎంఎస్ రాష్ట్ర డైరెక్టర్ నిట్టూరు రఘునాథరెడ్డి, రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ హరిత రాజగోపాల్, ఎంపిపి నాగేశ్వరరావు, జడ్పీటీసీ నాగరత్నమ్మ, సింగిల్‌విండో ఛైర్మన్ లోకనాథరెడ్డి, వైస్ ఎంపిపి వెంకటలక్ష్మి, సర్పంచి సుప్రియ, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, తహశీల్దార్ నారాయణస్వామి, ఎంపిడిఓ దివాకర్, ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహా, వెలుగు జిల్లా అధికారి మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.